ఈనాడు
పశ్చిమగోదావరి
గురువారం అక్టోబరు 3, 2024

అసైన్డ్ భూముల్లో భూచోళ్లు!

పెద్దల గుప్పిట్లో పేదల జాగాలు

అడ్డగోలుగా ఆన్‌లైన్ చేసిన తహసీల్దార్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ కుంభకోణం

ఈనాడు, భీమవరం, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

పేదలు నాలుగు తిండి గింజలు పండించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సైతం వైకాపా నేతలు మింగేశారు. నిబంధనలకు నీళ్లొదిలి అసైన్డ్ భూముల రికార్డులు తారుమారు చేయించారు. ముడుపుల మత్తులో, నేతల అండతో కొందరు రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాలు పెద్దల గుప్పిట్లో ఉన్నాయి.




అసైన్డు భూములను సాగు చేసుకోవటం తప్ప క్రయవిక్రయాలు నిషిద్ధం. లబ్ధిదారు పేరు ప్రభుత్వ దస్త్రాల్లో మార్చుకునేందుకు వీలు లేకుండా ఈ భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. పట్టాలిచ్చిన వారు మరణించినా వారసులకు సంక్రమిస్తుంది తప్ప ఇతరులకు దానిపై హక్కు ఉండదు. ఈ తరహా భూములు ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల వరకు ఉన్నాయి. వైకాపా పాలనలో కొందరు భూస్వాములు పేదల అవసరాల ముసుగులో అరకొర ధరలు చెల్లించి స్వాధీనం చేసుకున్నారు.

☛ చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో వెయ్యి ఎకరాల అసైన్డు భూమి ఉంది. వీటిలో 100 సర్వే నంబర్లకు సంబంధించిన 300 ఎకరాల్లో రికార్డులు మార్చేశారు. లబ్ధిదారుల పేరు మీద పట్టా ఉన్నా ఆన్‌లైన్ మాత్రం వారి పేరుపై లేకుండా అధికారులు ముడుపులు తీసుకుని కథ నడిపించారు. తాజాగా దీనిపై గ్రామానికి చెందిన తుల్లిమిల్లి కుటుంబరావు సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించగా వెలుగులోకి వచ్చింది.

☛ నరసాపురం మండలంలో ఓ వైకాపా నేత చక్రం తిప్పారు. దాదాపు 150 ఎకరాల అసైన్డ్, డీపట్టా, జిరాయితీ భూములను తన అనుచరులతో తక్కువ మొత్తానికి కొనుగోలు చేయించారు. రెవెన్యూ అధికారులతో ఆన్‌లైన్ చేయించుకున్నారు. మొగల్తూరు మండలం మోళ్లపర్రులో కూడా ఆ నేత అనుచరుడితో దాదాపు 50 ఎకరాల అసైన్డు భూమి కొనుగోలు చేయించి ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించడం అప్పట్లో పెద్ద దుమారం రేగింది.

“ జిల్లాలో దాదాపు 70 శాతం భూములు రెండు మూడు చేతులు మారిపోయాయి. పట్టా పొంది 20 ఏళ్ల అనుభవంలో ఉన్న వారికి వైకాపా సర్కారులో క్రయ విక్రయాలకు హక్కులు(ఫ్రీహోల్డ్) ఇచ్చారు. దీని ముసుగులో అర్హత లేని వారికి కూడా రెవెన్యూ అధికారులు హక్కులు కల్పించారు. ”

జిల్లాల వారీగా భూముల వివరాలు (ఎకరాల్లో)



చింతలపూడిలో 80 శాతం.. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా చింతలపూడి మండలంలోనే 18 వేల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. వీటిలో దాదాపు 80 శాతం క్రయ విక్రయాలు జరిగిపోయాయి. అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు నిషిద్ధం కాగా 2019-24 మధ్య కాలంలో చింతలపూడిలో పని చేసిన ముగ్గురు తహసీల్దార్లు ఏకంగా రికార్డులే మార్చేశారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన లబ్ధిదారుల పేర్లను తొలగించి కొనుగోలు చేసిన వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారికి పాసు పుస్తకాలు కూడా రప్పించారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.8 లక్షల వరకు వసూలు చేశారు. ఒక్క చింతలపూడి మండలంలోనే దాదాపు 8వేల ఎకరాల వరకు ఇలా రికార్డులు మార్చారు. ఎకరానికి సగటున రూ.లక్ష లెక్కన రూ.80 కోట్లు స్వాహా చేశారు. ఈ అంశమై ఏలూరు, పశ్చిమ డీఆర్వోలు పుష్పమణి, ఉదయభాస్కరరావు మాట్లాడుతూ.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తొలిరోజు దరఖాస్తుల్లేవ్!



మద్యం విక్రయాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నూతన విధానంలో భాగంగా మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. దీనికి సంబంధించిన రాజపత్రం విడుదల కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. జిల్లాలో 6 స్టేషన్ల పరిధిలో 175 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. దుకాణాలకు దరఖాస్తులను స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభం కాగా తొలిరోజు ఒక్కటి కూడా దాఖలు కాలేదని అధికారులు చెప్పారు. రెండు నామమాత్రపు దరఖాస్తులు అందినా వాటికి డీడీలు ఇవ్వలేదన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 11న నిర్మలా దేవి ఫంక్షన్ హాలులో లాటరీ నిర్వహిస్తారు.

తెర వెనుక మంత్రాంగాలు.. మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు సిండికేట్లు పార్టీలకు అతీతంగా పావులు కదుపుతున్నారు. వివిధ స్థాయిల నాయకులతో తెరవెనుక మంత్రాంగాలు జోరందుకున్నాయి. జిల్లాలో గతంలో 191 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పుడు 175 దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. కల్లుగీత వృత్తిపై ఆధారపడిన సామాజిక వర్గీయులకు కేటాయించే 10 దుకాణాల వివరాలు వెల్లడించలేదు.

నిబంధనలపై కసరత్తు.. దుకాణాలను లాటరీలో దక్కించుకున్న వెంటనే నగదు ఎంత చెల్లించాలి, శాశ్వత దుకాణాలు ఏర్పాటు వివరాలను ఆయా స్టేషన్లకు వెళ్లి తెలుసుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. జనాభా ఆధారంగా రూ. 50 లక్షలు, రూ. 55 లక్షలు, రూ. 65 లక్షలు, రూ.85 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. లాటరీలో ఎంపికైతే వెంటనే కొంత సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది.

విక్రయించేది ఎవరు?.. ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఆందోళన కొనసాగిస్తున్నారు. 5వ తేదీ వరకు విధుల్లో కొనసాగుతామని, రాష్ట్ర ప్రభుత్వంతో శనివారం జరిగే చర్చల్లో ఏకాభిప్రాయం కుదరకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఆ సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. ఒక వేళ చర్చలు ఫలించకపోతే మద్యం విక్రయాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అబ్కారీ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కొత్త దుకాణాలు ఏర్పాటయ్యే ప్రస్తుత విధానంలోనే మద్యం విక్రయాలు కొనసాగుతాయని అబ్కారీ ఉమ్మడి జిల్లా డీసీ బి.శ్రీలత చెప్పారు.

కొలను కాదు.. పొలమే



ఉండి, న్యూస్‌టుడే: తామరాకులు.. గుర్రపుడెక్కతో అల్లుకుపోయిన ఈ భూమి వరిచేనే. ఉండి మండలం పాందువ్వలోనిది. అతివృష్టి ప్రభావంతో జిల్లాలో భీమవరం, నరసాపురం, ఆచంట, ఉండి, పాలకొల్లు తదితర నియోజకవర్గాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో ముంపునీట చిక్కి పూర్తిగా దెబ్బతిన్న 7,200 ఎకరాల్లోని ఖరీఫ్ భూములు ఇలా మారిపోయాయి. రెండేళ్ల నుంచి పంట దెబ్బతిన్నచోట్ల కిక్కిస, తూడుతో పాటు వివిధ రకాల కలుపు మొక్కలు ఏపుగా మొలకెత్తుతున్నాయి. ఆరేడులో కిక్కిస మొలకెత్తింది. మురుగు వెళ్లేందుకు సరైన మార్గం లేనిచోట్ల కొన్ని ప్రాంతాల్లో భూముల్లో ఒకట్రెండు అడుగుల నీటితో నేటికీ చెరువులా కన్పిస్తున్నాయి. ఈ భూములను రబీలో సాగుకు అనుకూలంగా మార్చుకోవాలంటే ఎకరానికి కనీసం రూ.10 వేల చొప్పున అదనపు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

మావుళ్లమ్మకు.. నేడు స్వర్ణ కవచాలంకరణ



చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ గురువారం స్వర్ణ, రజత కవచాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు అమ్మవారికి నిత్యం ప్రత్యేక అలంకరణలు, లక్ష కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు ఏసీ నగేశ్ తెలిపారు.





దసరా రద్దీ!

దసరా సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండులు కిటకిటలాడుతున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లను, బస్సులను నడుపుతున్నా ప్రయాణికుల అవస్థలు తప్పడంలేదు. ఏలూరు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్లలో కనిపించిన చిత్రాలివి. - ఈనాడు, ఏలూరు

టెట్‌కు ఏర్పాట్లు

జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుంచి మూడు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను విద్య, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు, వైద్య ఆరోగ్య, పురపాలక శాఖల అధికారులు ఇప్పటికే పరిశీలించారు.

భీమవరం, తాడేపల్లిగూడెంలో.. భీమవరంలోని డీఎన్నార్ ఇంజినీరింగ్, డీఎన్నార్ అటానమస్, తాడేపల్లిగూడెంలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ నెల 5, 6, 7, 13, 19, 20 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయి. మొత్తం 2,617 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంది. ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

గంట ముందుగా రావాలి.. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాలి. ప్రారంభ సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. పరీక్షల నిర్వహణకు ముగ్గురు డిపార్టుమెంటల్ అధికారులను, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు.

పొగేసింది తక్కువ.. పోగేసింది ఎక్కువ

ఫాగింగ్ మాటున స్వాహా

ఖర్చు తప్ప కనిపించని ఫలితం

భీమవరం పట్టణం, తాడేపల్లి గూడెం అర్బన్, నరసాపురం, పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: దోమల ఉద్ధృతిని అరికట్టే రసాయన మిశ్రమ పొగ వెదజల్లే (ఫాగింగ్) ప్రక్రియ మొక్కుబడి తంతుగా మారింది. అలాగని దీనికి వెచ్చించే ఖర్చు ఏమాత్రం తక్కువ లేదు. జిల్లాలో అన్ని పట్టణాల్లో కలిపి ఏటా రూ.కోటికి పైగా ఖర్చు చూపుతున్నారు. ప్రజలకు మాత్రం పగలూ రాత్రి అని తేడా లేకుండా దోమకాట్లు తప్పడం లేదు. ఇటీవల మలేరియా, డెంగీ తదితర జ్వరాలతో వేలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.



భీమవరంలో మూలకు చేరిన ఫాగింగ్ పరికరాలు

76లో పనిచేసేవి 16.. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పురపాలక సంఘాలతో పాటు ఆకివీడు నగర పంచాయతీలో కలిపి మొత్తం 190 వార్డుల్లో దాదాపు 76 ఫాగింగ్ యంత్రాలు ఉన్నట్లు లెక్కల్లో చూపుతున్నారు. వీటిలో పనిచేసేవి కేవలం 16 మాత్రమే. ఫాగింగ్ యంత్రాల నిర్వహణ, మరమ్మతులు, కొత్తవి కొనుగోలు పేరిట ఏటా రూ.లక్షల ఖర్చు చూపుతున్నారు. పొగ మాటున కొందరు అధికారులు, సిబ్బంది ప్రజా ధనాన్ని స్వాహా చేస్తున్నారు. గతంలో ఎక్కడైనా ఫాగింగ్ చేస్తే పురపాలక కార్మికులు స్థానికుల నుంచి సంతకాలు తీసుకొనే వారు.. గత అయిదేళ్లలో ఈ తరహా నిబంధనల ఊసే మరిచారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇంధనం ఏమైంది? పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో రెండేళ్ల కిందట రూ.8 లక్షలతో 20 ఫాగింగ్ పరికరాలు కొనుగోలు చేశారు. వీటిని వినియోగించే సమయంలో ఒక్కసారిగా మంటలు వస్తుండటంతో మూలకు చేర్చారు. పాత యంత్రాలను వినియోగిస్తున్నట్లు చెబుతున్నా వాటిలోనూ 12 మరమ్మతులకు గురికాగా ఇప్పుడు 7 మాత్రమే పనిచేస్తున్నట్లు సమాచారం. కానీ గతంలో ఈ పరికరాల వినియోగానికి నిత్యం 70 లీటర్ల డీజిల్, 14 లీటర్ల పెట్రోలు ఉపయోగించినట్లు లెక్కల్లో చూపారు. విచిత్రం ఏమిటంటే దోమల నియంత్రణకు ఉపయోగించేందుకు మలాథియాన్, డెల్‌ఫాగ్ తదితర రసాయన మందులు మూడేళ్లుగా కొనుగోలు చేయలేదు. కానీ ఫాగింగ్ కోసం భారీగా ఇంధనం వినియోగించినట్లు ఆరోపణలున్నాయి. దీనిలో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన ఓ అధికారి పాత్ర ఉన్నట్లు సమాచారం.

☛ వాణిజ్య కేంద్రమైన తాడేపల్లిగూడెంలో 35 వార్డులకు తగినన్ని ఫాగింగ్ పరికరాలు లేవు. ఉన్న మూడు పరికరాలకు మరమ్మతుల పేరిట పెట్టిన బిల్లుల్లో తేడాలు ఉండటంతో ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పట్టణమంతా ఒక్క సంచార ఫాగింగ్ వాహనం అప్పుడప్పుడూ చక్కర్లు కొడుతోంది. దీనికి ఖర్చు మాత్రం నెలకు రూ.60వేలపైనే ఉంటుంది.

☛ పాలకొల్లులో 31 వార్డులకు మూడు పరికరాలు మాత్రమే ఉండగా ఒకటి మరమ్మతులతో ఉంది. నరసాపురంలో 31 వార్డులకు గాను మూడు యంత్రాలు ఉండగా ఒక్కటే మాత్రమే వినియోగిస్తున్నట్లు సమాచారం.



కార్మికుడికి సామగ్రి కిట్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి, చిత్రంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు కనుమూరి, పులపర్తి, పితాని

ప్రజా ఉద్యమంలా స్వచ్ఛత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛత ప్రజా ఉద్యమంలా సాగాల్సిన అవసరం ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమాన్ని భీమవరం పురపాలక కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శాంతి దూత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేద్దామన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి గాంధీ జయంతిని ప్రపంచ అహింసా దినోత్సవంగా ప్రకటించడమంటే ఆయన ప్రభావం ఎంతగా విస్తరించిందో అర్థమవుతుందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి కిట్లను అందజేశారు. తొలుత గాంధీ విగ్రహానికి, వేదికపై ఉంచిన లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కనుమూరి రఘురామకృష్ణరాజు, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, అదనపు ఎస్పీ వి.భీమారావు, డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, ఆర్డీవోలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వై.భవానీశంకరి, దాసి రాజు, కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహసీల్దారు రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన క్రీడాకారులు

నిత్యసాధనతో విజయాలు

పెదవేగి, న్యూస్‌టుడే: క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవీఈవో ప్రభాకరరావు అన్నారు. స్థానిక గురుకుల బాలుర పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-19 విభాగం రాష్ట్రస్థాయి పోటీలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు విజయం సాధించాలన్న లక్ష్యంతోనే మైదానంలోకి దిగుతాడని... కానీ, ఒకరే విజేతగా నిలుస్తారన్నారు. ఓటమి పాలైన వారు నిరుత్సాహానికి గురికాకుండా నిత్య సాధనతోనే విజయాలు సొంతం చేసుకోగలరన్నారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.జయరాజు మాట్లాడుతూ... సాఫ్ట్‌బాల్, రగ్బీ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 420 మంది క్రీడాకారులు తరలివచ్చారని, వారంతా గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఆయన కోరారు.

పట్టభద్రులకు ఓట్ల పండగ | 8లో | రత్నాచల్ 30 ఏళ్ల సంబరాలు

వదిలేస్తే కాసులు.. పట్టిస్తేనే కేసులు!

జిల్లాలో ఆగని ఇసుక దందా

రాత్రి వేళ తీరంలో అక్రమ తవ్వకాలు

☛ పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల్లోని గోదావరి తీరంలో కొన్ని రోజులుగా రాత్రి వేళ గుట్టుగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. స్థానిక అధికారులకు తెలిసే తతంగం జరుగుతుందనేది జనమెరిగిన సత్యం. అబ్బిరాజుపాలెంలో రాత్రి వేళ ఇసుక అక్రమంగా ట్రాక్టర్లలో ఎగుమతులు చేసి కొందరు జేబులు నింపుకొంటున్నారు.

☛ ఆచంట మండలం పెదమల్లంలో గత నెల 29 అర్ధరాత్రి గోదావరిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న పడవలను స్థానిక జన సైనికులు పట్టుకున్నారు. వాస్తవానికి ఇది అధికారులు చేయాల్సిన పని. వదిలేస్తే కాసులు వర్షం. ఎవరైనా పట్టిస్తేనే కేసులు పెడతాం.. అన్న చందాన జిల్లా యంత్రాంగం వ్యవహరిస్తోంది.

పాలకొల్లు, న్యూస్‌టుడే: ట్రాక్టర్లలో ఎగుమతి చేస్తున్న ఇసుక ప్రస్తుతం రూ.5 వేలకు పైనే విక్రయిస్తున్నారు. వచ్చే కార్తిక మాసంలో ముహూర్తాలు ఉండటంతో 70 శాతం పనులు పూర్తయినవారు ఉచిత ఇసుక అందుబాటులోకి వచ్చేవరకు ఆగలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. వచ్చిన గిరాకీని ఆసరాగా తీసుకుని ధరల దందా కొనసాగిస్తున్నారు. ఇసుక అవసరం ఉన్నవారు కొందరు సొంతగా అంతర్జాలంలో నమోదు చేసుకుని స్టాక్ పాయింట్ దగ్గర నుంచి తెచ్చుకుందామన్నా సాంకేతిక సమస్యలు విసుగెత్తిస్తున్నాయని నరసాపురానికి చెందిన రాజు వాపోయారు.



జిల్లాలో 60 కిలోమీటర్ల మేర గోదావరి తీరం విస్తరించి ఉన్నా ఎక్కడా ఇసుక తవ్వకాలు చేపట్టడానికి అనుమతులు లేవు. స్టాక్ పాయింట్లు పెట్టారా అంటే అదీ లేదు. కాని ఇదిగో దొడ్డిపట్ల - పాలకొల్లు ప్రధాన రహదారిలో ఇసుక లోడుతో ఒక ట్రాక్టర్ మంగళవారం పట్టపగలు పట్టణంలోకి దూసుకెళ్తుంది. ఈ ఇసుక ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరైనా సమాధానం చెప్పగలరా అంటే ఒక్క అధికారికి నోరు పెగలదు.

దళారుల బుకింగ్‌లే ఎక్కువ.. ఇసుక అక్రమ వ్యాపారం చేసేవారంతా కొందరిని అంతర్జాల బుకింగ్‌ల నిమిత్తం ప్రత్యేకంగా నియమించుకుంటున్నారు. వారు రోజూ చేతనైనన్ని బుకింగ్‌లు చేస్తూ ఇసుక పాయింట్లలోని అత్యధిక యూనిట్లను కొల్లగొడుతున్నారు. బుకింగ్‌ల ప్రకారం ఇసుకను తెచ్చుకుని సొంత వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారు.

సవాళ్లను అధిగమిస్తూ.. పల్లె ప్రగతికి కృషి

'న్యూస్‌టుడే'తో డీపీవో అరుణశ్రీ

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటూ అవినీతి, అక్రమాలను ఉపేక్షించకుండా.. సవాళ్లను అధిగమిస్తూ పాలన సాగిస్తానని జిల్లా పంచాయతీ అధికారిణి బి.అరుణశ్రీ స్పష్టం చేశారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆమె 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీరు, నిధుల దుర్వినియోగం, ఆక్రమణలు, అనధికార లేఅవుట్లు తదితర విషయాలపై స్పందించారు.



ముఖాముఖి

కార్యదర్శుల పనితీరును పరిశీలిస్తా.. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు నిధుల కొరత లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోంది. వాటి పర్యవేక్షణ, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ వంటి పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. వారి పనితీరును నిశితంగా పరిశీలిస్తా. ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు.

ట్యాంకుల శుభ్రతకు చర్యలు తాగునీటి ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయడం లేదంటూ ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాన్ని చూశా. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీవీ.నాగేశ్వరరావుతో మాట్లాడా. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వీలైనంత వేగంగా ట్యాంకులు శుభ్రం చేయించడంతోపాటు తాగునీటిని విధిగా క్లోరినేషన్ చేయించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రజారోగ్యంపై దృష్టి జిల్లాలో చాలా మంది విషజ్వరాలతో బాధపడుతున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యలేమి ఇందుకు కారణం. అందుకే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తా. గ్రామాల్లోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటా. దోమల నివారణకు అవసరమైనప్పుడల్లా ఫాగింగ్ చేయించడం, ఇతర ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తా.

ఆక్రమణలపై దృష్టి పలు చోట్ల నుంచి ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఆక్రమణలుంటే కార్యదర్శులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా చెరువు పోరంబోకు, అంతర్గత రహదారులు ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షించాలి. జిల్లా వ్యాప్తంగా అనధికార లేఅవుట్ల గుర్తింపునకు చర్యలు తీసుకుంటాను.





చెక్క, ఫైబర్‌తో తయారు చేసిన వేంకటేశ్వరస్వామి రథం ★ ఎద్దులబండి ★ అశ్వరథం

రథ శోభ!

దేవీ దేవతామూర్తుల ఉత్సవాలు, ఊరేగింపులు, శుభకార్యాలకు కావాల్సిన రీతుల్లో రథాలను ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో సిద్ధం చేస్తున్నారు. స్టీల్, ఇనుము, ఫైబర్, చెక్క తదితర ముడి పదార్థాలతో బొమ్మలు తయారు చేసి ఆటోలు, జీపులు, ట్రాక్టరు తొట్టెలపై అమర్చుతున్నారు. వీటిని పూలదండలు, విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేసి అద్దెకు ఇస్తున్నారు. ఈ రథాల కోసం ఉమ్మడి గోదావరి జిల్లాలతోపాటు ఇతర జిల్లాల నుంచి ప్రజలు వస్తున్నారు.

- ఈనాడు, ఇరగవరం

రత్నాచల్ 30 ఏళ్ల సంబరాలు

విజయవాడ, న్యూస్‌టుడే: విజయవాడ, విశాఖపట్నం మధ్య నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తవడంతో బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ రైలు అక్టోబరు 2వ తేదీనాడు 1994లో ప్రారంభమైంది. మొదట రత్నగిరి హిల్స్ పేరుతో నడిచేది. 1999 నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారింది. 2006 నుంచి ఈ రైల్లో అత్యాధునిక సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సీసీటీవీ ర్యాకులు, పూర్తి స్థాయిలో లెథర్లు, డబ్ల్యూఏపీ4 అత్యాధునిక ఇంజినుతో పాటు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైలు వేగంతో పాటు 24 బోగీలకు పెంచారు. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి రాత్రికి తిరిగి చేరుకునే ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రోజూ 140శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసుకుంటుంది. ఉద్యోగులు, వ్యాపారులకు ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా మారింది. వేడుకల సందర్భంగా ప్రయాణికులు, రైల్వే సిబ్బంది విజయవాడ రైల్వేస్టేషన్‌లో కేక్ కోసి సంబరాలు నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న ప్రయాణికులు, రైల్వే సిబ్బంది

రేపు కైకలూరులో ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి తెలిపారు. వివిధ ప్రైవేటు సంస్థల్లో 362 ఖాళీలను ఉద్యోగ మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హత కలిగి... 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి ★ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ

గాంధీ మార్గం అనుసరణీయం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ ఆచరించిన శాంతి మార్గం అనుసరణీయమని కలెక్టర్ నాగరాణి అన్నారు. భీమవరం జువ్వలపాలెం రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఆమె బుధవారం నివాళులర్పించారు. ★ కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన వేడుకలో సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మహనీయుల ఆశయ సాధనకు శాంతి, సమానత్వం, మత సామరస్యాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి కోరారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నరసాపురంలో పులస కిలో రూ.2 వేలు



నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం మార్కెట్లో పులస చేపలు కిలో రూ.2 వేల చొప్పున విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఒడిశా రాష్ట్రం నుంచి తీసుకొచ్చిన పులసలను విక్రయించారు. పలువురు మాంసాహార ప్రియులు వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

ఉద్యమాల్లో ఏపీటీఎఫ్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న అధ్యక్షురాలు మంజుల

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఉద్యమాల్లో ఏపీటీఎఫ్ పాత్ర కీలకమైందని అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాల ఉద్యమ అధ్యయన తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మరిన్ని ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం ప్రతి ఒక్కరు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఏపీటీఎఫ్ ఉద్యమ చరిత్ర, పని విధానం తదితర అంశాలు వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సొమ్ము స్వాహా

రూ.2 కోట్ల వరకు నిధుల దుర్వినియోగం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో దాదాపు కలిసిపోయినట్లు ఉండే రాయలం పంచాయతీ వార్షికాదాయం రూ.కోటిపైగా ఉంటుంది. పురపాలక సంఘంలో విలీనం పేరుతో దీనికి అయిదేళ్ల పాటు పాలకవర్గం లేకుండా చేశారు. ఈ గ్రామానికి మూడేళ్ల పాటు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా వ్యవహరించిన అధికారి పంచాయతీ నిధులను స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అధికారి అప్పటి కీలక ప్రజాప్రతినిధికి అత్యంత నమ్మకస్థుడిగా గుర్తింపు పొందడంతో స్థానిక వైకాపా నాయకులు కూడా అతడికి అడ్డుకట్ట వేయలేకపోయారనే వాదనలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్కడి నాయకులు లెక్కలు అడగడంతో అవినీతి డొంక కదిలింది.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

విలీన ప్రతిపాదిత గ్రామం కావడంతో ఈ గ్రామానికి సంబంధించి ఆర్థిక వ్యవహారాలన్నింటినీ తన దృష్టికి తీసుకురావాలని నాటి కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. పంచాయతీ దస్త్రాలన్నింటినీ పురపాలక అధికారులకు అప్పగించాలని స్పష్టం చేశారు. సదరు అధికారి ఆ ఆదేశాలను పాటించలేదు. పన్నులు, ఇతర ఆదాయాలను పంచాయతీ ఖాతాకు.. దాని నుంచి తన సొంత ఖాతాల్లోకి యథేచ్ఛగా మళ్లించుకున్నారు. ఈ మొత్తమే రూ.కోటి పైగా ఉంటుందని సమాచారం. పన్నుల రూపంలో నేరుగా వసూలు చేసింది మరో రూ.60 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. ఈ పంచాయతీలో మొత్తం రూ.2 కోట్ల మేర నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. ఒక పంచాయతీలో ఇంత భారీ స్థాయిలో అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మరికొన్ని పంచాయతీల్లో ఈ తరహా అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది.



సందేహాలెన్నో..

ఈ ఏడాది మార్చిలో సదరు అధికారిని ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించి కొత్త కార్యదర్శిని నియమించినా జూన్ వరకు దస్త్రాలు అప్పగించలేదు. దీనిపై దుమారం రేగడంతో ఎట్టకేలకు దస్త్రాలను స్వాధీనం చేయగా కొత్త కార్యదర్శి సైతం నిధులు పక్కదారి పట్టిన విషయాన్ని పట్టించుకోలేదు. దీనిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీకి వచ్చిన ఆదాయం, ఖజానాలో జమ అయిన సొమ్ము లెక్కలను పంచాయతీ విస్తరణాధికారి కూడా చెప్పలేకపోవడం గమనార్హం.

శాఖాపరంగా చర్యలు

ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ సొమ్మును సొంత ఖాతాల్లోకి మళ్లించడం నేరమన్నారు. అలా ఎవరు చేసినా చర్యలు తప్పవన్నారు. ఇలాంటి వ్యవహారంపై విచారణ జరిపి నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

రూ.300 కోట్ల పరిశ్రమకు శంకుస్థాపన

దెందులూరు, న్యూస్‌టుడే: దెందులూరు మండలం కండ్రికలో రూ.300 కోట్ల అంచనా వ్యయంతో హెచ్‌పీసీఎల్ సంస్థ నిర్మించనున్న బయోగ్యాస్ తయారీ ప్లాంటుకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్లాంటు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ... ప్లాంటు ఏర్పాటుతో గ్రామంలోని సుమారు 150 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

పురపాలక బడుల్లో ఉపాధ్యాయుల్ని నియమించాలి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. నగరంలో సంఘం ఆధ్వర్యాన బుధవారం సత్యాగ్రహ దీక్ష చేశారు. రవికుమార్ మాట్లాడుతూ... పురపాలక ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందడం లేదన్నారు. ఉపాధ్యాయుల్లో అర్హులైన వారిని ఎంఈవోలుగా నియమించాలని కోరారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. సంఘ నాయకులు శివశంకరరావు, బి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

నిబంధనల ప్రకారమే దర్యాప్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

కాళ్ల, న్యూస్‌టుడే: కస్టోడియల్ టార్చర్‌పై తాను ఇచ్చిన ఫిర్యాదుపై నిబంధనల ప్రకారం దర్యాప్తు చేశాక 30 రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. పెదఅమిరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యనేత ఒత్తిడి ఉంటే ఎఫ్ఐఆర్ నమోదుకు 30 రోజుల సమయం పడుతుందా అని ప్రశ్నించారు. మూడు నెలల తర్వాత ఇప్పుడిప్పుడే ఈ కేసు కొలిక్కి వస్తోందన్నారు. న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకంతోనే తాను ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరుమలలో తన కుమార్తె తరఫున డిక్లరేషన్ ఇచ్చినట్లుగానే జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇవ్వాలని సూచించారు. డిక్లరేషన్ ఇచ్చి శ్రీవారిపై నమ్మకం ఉందని చాటుకునే అవకాశాన్ని అవగాహన లేమి, అహంకారంతో జగన్ పోగొట్టుకున్నారన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం 15 రోజులకే పరిమితం కాకూడదని.. ఇది జీవన విధానంగా మారాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందుకే తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయక ముందే ఉండి నియోజకవర్గంలో కాలువల శుభ్రత, గట్లపై ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

తెదేపా సభ్యత్వం గర్వకారణం : మంతెన



మంతెనను సన్మానిస్తున్న షరీఫ్, రామరాజు తదితరులు

నరసాపురం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వం తీసుకోవడం గర్వకారణంగా భావించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు శ్రేణులకు సూచించారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి, ఇతర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, సమాచారం తెలియజేయడం లేదని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉమ్మడి కుటుంబాల్లో చిన్న చిన్న సమస్యలు ఉంటాయని అందరూ సమన్వయంతో పనిచేయాలని రామరాజు సూచించారు. శాసన మండలి మాజీ ఛైర్మన్ యంఏ షరీఫ్ మాట్లాడుతూ అన్ని పనులకు ఎమ్మెల్యేపై ఆధారపడవద్దని శ్రేణులకు అవసరమైన పనులు చేసేందుకు పార్టీపరంగా చర్యలు చేపడతామని చెప్పారు.

అటవీ శాఖ సిబ్బందిపై గ్రామస్థుల దాడి!

నలుగురికి గాయాలు

లింగపాలెం, న్యూస్‌టుడే: అటవీ భూముల ఆక్రమణపై ప్రశ్నించిన ఆ శాఖ సిబ్బందిపై ఏలూరు జిల్లా లింగపాలెం మండలం కలరాయనగూడెం గ్రామస్థులు కర్రలతో దాడిచేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అటవీ భూమిని కొందరు సాగు చేసేందుకు దున్నుతుండగా.. అటవీ శాఖ సిబ్బంది అడ్డుకున్నారు. ఆ సమయంలో పది మంది వ్యక్తులు మూకుమ్మడిగా కర్రలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. పోలీసులకు సమాచారం అందడంతో చింతలపూడి సీఐ ఎం.రవీంద్ర, ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులను చెదరగొట్టి బాధితులకు ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రక్షణ కల్పించారు. గ్రామంలోని వైకాపా నాయకుడి ప్రోద్బలంతోనే తమపై దాడి జరిగినట్లు అటవీ సిబ్బంది ఆరోపిస్తున్నారు. అయితే పోలీసులు అతడిని కేసు నుంచి తప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అటవీ సిబ్బందిపై దాడి చేసిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.

పట్టభద్రులకు ఓట్ల పండగ

నవంబరు 6 వరకు దరఖాస్తుకు అవకాశం

ముదినేపల్లి, న్యూస్‌టుడే

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితాకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఓటరు నమోదు ప్రక్రియకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. అర్హులైన పట్టభద్రులు నవంబరు 6 వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. అర్హుల నుంచి ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 6 వరకు నమోదు ప్రక్రియ పూర్తి చేసి 23న ముసాయిదా జాబితా ప్రచురిస్తారు. 29 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబరు 25 నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి 30న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

2019 ఎన్నికల్లో.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఓటర్లు : 1, 21,379 పోలింగ్ కేంద్రాలు : 133

దరఖాస్తు ఇలా..

- గతంలో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు నమోదు చేసుకున్న ఓటు ప్రస్తుతం ఉండదు. అందరూ కచ్చితంగా నమోదు చేసుకోవాలి.
- 2021 అక్టోబరు నాటికి పట్టభద్రులైన వారు ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులు.
- మండలపరిషత్తు, రెవెన్యూ కార్యాలయాల్లో ఫారం-18 దరఖాస్తు పొందాలి. గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసిన డిగ్రీ ధ్రువపత్రం నకలు జతచేయాలి.
- రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అతికించాలి.
- ఆధార్‌కార్డు నకలు, చిరునామా ధ్రువపత్రం జత చేయాలి.
- సీఈవో ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైటులో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

జిల్లా ఒక్కటి.. రెండు ఎమ్మెల్సీ ఎన్నిక..

జిల్లాల పునర్విభజనలో ఏర్పడిన ఏలూరు జిల్లాలో అటు ఉమ్మడిపశ్చిమగోదావరి జిల్లాతో పాటు కృష్ణా జిల్లాకు చెందిన రెండు మండలాలు ఉన్నాయి. కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల పట్టభద్రులు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలోఉండటంతో ఆ ఓటరు జాబితాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, మిగిలిన జిల్లా వారు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల జాబితాకోసం దరఖాస్తు చేసుకోవాలి.

పదవీకాలం ముగియడంతో..

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న కెఎస్.లక్ష్మణరావు పదవీకాలం, ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) పదవీకాలం మార్చి 2025తో ముగుస్తుంది. దీంతో వీటి ఎన్నికకు ప్రక్రియ ప్రారంభించారు. 2019లో సార్వత్రిక ఎన్నికల ముందు కావడంతో ఇరు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికపై పెద్దగా దృష్టి పెట్టలేదు. అయితే ఈసారి ఆ పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఓటర్ల నమోదు ప్రక్రియకు ముందే అభ్యర్థులను సైతం ప్రకటించేయడంతో రాజకీయ వేడి మొదలైంది.

భీమవరం బుల్లెమ్మ పెళ్లి పేరిట మోసం

బ్రోకర్లు, మహిళపై బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు

హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన ఓ యువకుడికి దాదాపు 40 ఏళ్లు వచ్చినా వివాహం కాలేదు. ఇంట్లో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు చూసిన అతడు వారిని సంతోష పెట్టాలని భీమవరం ప్రాంతానికి వెళ్లి అక్కడ బ్రోకర్లను ఆశ్రయించాడు. వారు రూ.లక్షలు దండుకొని ఓ మహిళతో వివాహం జరిపించారు. ఆమెను హిందూపురం తీసుకొచ్చినా అతడితో కాపురం చేయకుండా వాయిదా వేస్తూ వచ్చింది. వారం రోజుల తర్వాత తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని వెంటనే వెళ్లాలని చెప్పింది. దీనికి అతను నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకొంటానని బెదిరించడంతో ఆమెను తీసుకొని భీమవరానికి రైలులో వెళ్లాడు. రైల్వేస్టేషన్‌లో దిగిన వెంటనే ఆమె మన వివాహం మా తల్లిదండ్రులకు తెలియదని, వారికి తెలిస్తే చాలా ఇబ్బందని, ఇక్కడే ఉండు వస్తానని చెప్పి వెళ్లింది. అంతే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి మూడు, నాలుగు రోజులు గడిచినా రాకపోవటంతో వెనుదిరిగిన అతను చేసేది లేక బుధవారం బ్రోకర్లు, మహిళ మోసం చేసిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాత్రి విధులు నిర్వర్తిస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్‌పై ముగ్గురు దాడికి పాల్పడిన ఘటన నగర శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పెదపాడు పోలీసుస్టేషన్‌లో చింతపల్లి కృష్ణ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి హోంగార్డు నాగేశ్వరరావుతో కలిసి రాత్రి బీట్ వన్ విధులు నిర్వహిస్తున్నారు. ఒకటిన్నర గంటల సమయంలో తాళ్లమూడి సమీప ఓ దాబా వద్ద గొడవ జరుగుతున్నట్లు సమాచారం అందింది. ముగ్గురు వ్యక్తులు గొడవ పడుతుండగా... వారిని కృష్ణ ప్రశ్నించారు. దాంతో వారు దుర్భాషలాడుతూ ముఖం, ఛాతిపై పిడిగుద్దులు కురిపించారు. హోంగార్డు అడ్డుకునే ప్రయత్నం చేయగా- అతడిపైనా దాడి చేసి పరారయ్యారు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. తాళ్లమూడికి చెందిన కంభం విజయ్, అజయ్, జగదీశ్ దాడి చేసినట్లు పోలీసులు గుర్తించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

చెత్త భారం తొలగింది

పట్టణ వాసులకు ఉపశమనం


ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పన్నుల భారంతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసి పాలన సాగించిన వైకాపా ప్రభుత్వ నిర్ణయాలపై ఒక్కొక్కటి సమీక్షించి ప్రజలపై భారాన్ని ఎన్డీయే ప్రభుత్వం తొలగిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణ వాసుల నుంచి సేకరించిన చెత్తకు పన్ను వసూలు చేసేందుకు తీసుకొచ్చిన క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) ప్రజల నడ్డివిరిచింది. బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెత్త పన్ను రద్దు చేసినట్లు ప్రకటించడంతో జిల్లా ప్రజలపై నెలకు సుమారు రూ.80 లక్షల వరకు భారం తగ్గనుంది.

మున్సిపాలిటీ	నివాసాలు	క్లాప్ వాహనాలు	చెత్తపన్ను (నెలకు సుమారు రూ.లక్షల్లో)
భీమవరం	41,836	36	25.10
తాడేపల్లిగూడెం	27,418	34	27.41
తణుకు	24,668	25	7.40
పాలకొల్లు	17,749	20	10.64
నరసాపురం	17,279	17	8.63

పోరాటం చేసినా.. స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన క్లాప్ ఫ్లాప్ అయ్యింది. ప్రజలపై మోపిన చెత్త పన్ను రద్దు చేయాలని ప్రజలు, ప్రజా సంఘాలు రోడ్డెక్కి పోరాటాలు చేసినా అప్పటి జగన్ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు సరికదా ఉద్యోగులకు లక్ష్యాలు ఇచ్చి మరీ వసూలు చేసింది. వెయ్యిళ్లకు ఒకటి చొప్పున టాటా ఏస్ వాహనాలను కేటాయించింది. వాటికి చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రజల నుంచి రూ.30 నుంచి రూ.150 వరకు యూజర్ ఛార్జీల రూపంలో వసూలు చేసి సర్దుబాటు చేసేవారు. ఒక్కో దానికి నెలకు ఆయా మున్సిపాలిటీల స్థాయిని బట్టి రూ. 50 వేల నుంచి రూ.60 వేల మధ్య స్థానిక సంస్థలే చెల్లించేలా టెండరు ద్వారా కాంట్రాక్టరును సమకూర్చారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించాల్సిన స్థానిక సంస్థల నిధులను సైతం పది శాతానికి పైగా వీటికి వినియోగించే వారు. అయినా పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడలేదు.

ఆటోను ఢీకొట్టిన వ్యాను


ఇద్దరు కూలీలకు గాయాలు



బుట్టాయగూడెం కూడలి వద్ద బోల్తాపడిన వ్యాను

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి వ్యాను బోల్తా పడటంతో పాటు ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అశ్వారావుపేట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న వ్యాను.. దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెంలోని బుట్టాయగూడెం కూడలి వద్దకు రాగానే.. ద్విచక్ర వాహన దారుడు అకస్మాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చాడు. అతడిని తప్పించే క్రమంలో వ్యాను చోదకుడు వాహనాన్ని పక్కకు తిప్పగా అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో జీలుగుమిల్లి వైపు కూలీలతో వెళుతున్న ఆటోను ఓ పక్కగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బయ్యనగూడేనికి చెందిన కూలీలు రాఘవులు, వెంకటేశ్‌లకు రక్త గాయాలయ్యాయి. వారిని స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

భగవాన్‌రాజు పుట్టినరోజు వేడుకలు



కేకు కోస్తున్న కాస్మోక్లబ్ అధ్యక్షుడు భగవాన్‌రాజు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కాస్మో కల్చరల్ క్లబ్‌లో అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పూలపల్లి గ్రామంలో పత్రీజీ ధ్యాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన కేకు కోసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. పట్టణ సీఐ రజనీకుమార్, డీటీడీసీ బాబు, సోమరాజు, తెదేపా నాయకులు, కాస్మో సభ్యులు, పుర ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉక్కు పరిశ్రమ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని పలువురు నాయకులు ఆరోపించారు. ఉక్కు పరిశ్రమ పోరాట వేదిక పిలుపు మేరకు స్థానిక వసంత మహల్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. విశాఖ ఉక్కుకు సొంతంగా గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని అంటూ నాయకులు చేశారు. వారు మాట్లాడుతూ... నష్టాలను సాకుగా చూపి వేలాది మంది ఒప్పంద కార్మికులను తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. రూ.3 లక్షల కోట్ల సంపద కలిగిన పరిశ్రమను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని చూస్తే ఊరుకోబోమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్‌వీడీ ప్రసాద్, కె.బుచ్చిబాబు, బి.వెంకటరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నరసాపురం, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్-1 పిల్లిపేటకు చెందిన రవ్వ ఉమామహేశ్వరి ఈ నెల 1న సాయంత్రం ఇంటికి తాళం వేసి అత్యవసర వాహనంలో విధులకు హాజరయ్యారు. తెల్లారి వచ్చి చూసేసరికి దుండగులు ఇంటికి వేసిన తాళం పగులకొట్టి బీరువాలో భద్రపరిచిన రూ.2.50 లక్షలు విలువగల బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భీమవరం

• భీమవరం • ఉండి

ఆహ్వాన వేడుక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థుల ఆహ్వాన వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ప్రధానాచార్యుడు ఎం.వేణు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

త్వరలో రక్తనిధి ప్రారంభం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం మండలం రాయలంలో జిల్లా రెడ్‌క్రాస్ భవనాన్ని కలెక్టర్ నాగరాణి బుధవారం సందర్శించారు. ఆ సంస్థ సమకూర్చిన రూ.2 కోట్ల విలువైన ఆధునిక యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ రక్త నిధి(బ్లడ్‌బ్యాంకు)ను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. దీనికి ఇప్పటికే అనుమతి వచ్చిందన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ శివరామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నాగరాణి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

ఉండి, న్యూస్‌టుడే

సమస్య: గోరింటోటలో ప్రాథమిక పాఠశాల ప్రాంగణం పల్లంగా ఉండటంతో వర్షాలు కురిసినప్పుడు భవనాల ఆవరణలో వరద నీరు చేరుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. **- గెల్లా జాన్ కెనెడీ విక్టర్‌బాబు, స్థానికుడు**

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచిస్తా. **- ఎస్ రవీంద్ర, ఎంపీడీవో**

వీరవాసరం, న్యూస్‌టుడే

సమస్య: కొణితివాడ గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రహదారిపై గుంపులుగా సంచరిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. **- నాగేశ్వరరావు, స్థానికుడు**

సమాధానం: పాలకవర్గంతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- చిట్టిబాబు, ఇన్‌ఛార్జి కార్యదర్శి**

శరన్నవరాత్రి శోభ


విద్యుత్తు దీపాల కాంతుల్లో పంచారామ క్షేత్రం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దన స్వామి, రెండో పట్టణంలో దుర్గాలక్ష్మి, పలు ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలను రంగుల విద్యుత్తు దీపాలతో నేత్రపర్వంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం కుంకుమ పూజలు, 16న గ్రామోత్సవం, 21న అన్నసమారాధన జరుగుతాయని ఆలయ మాజీ అధ్యక్షుడు పెన్మెత్స రమేశ్‌రాజు తెలిపారు.


భీమవరం రెండో పట్టణ పరిధిలో దుర్గాలక్ష్మి ఆలయం

అమ్మవారి గరగలకు అభిషేకాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం కుంకుమార్చనలు, అమ్మవారి గరగలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. గ్రామ ప్రత్యేక పూజలు అనంతరం పంచహారతులు ఇచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నేటి నుంచి 12వ తేదీ వరకు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ సేవా సంఘం ప్రతినిధులు, ఈవో సీతారామరాజు తెలిపారు.

ఇంకెన్నాళ్లు.. ఈ కష్టాలు!

ఛిద్రమైన పల్లె దారులు



వీరవాసరం, న్యూస్‌టుడే: పల్లె దారుల్లో ప్రయాణానికి అష్టకష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలకు భీమవరం నియోజకవర్గంలో కీలక రహదారులన్నీ గుంతల మయంగా మారాయి. చాలా చోట్ల కంకర తేలి ఛిద్రమయ్యాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రజలు నరకయాతన అనుభవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కష్టాలు తీరతాయని ప్రజలు ఆశించారు. ఇంతలోనే మరోసారి భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో రహదారులు మరింత దారుణంగా మారాయి.


దాదాపు అయిదు కిలోమీటర్ల మేర విస్తరించిన తోలేరు ఆర్అండ్‌బీ రహదారి మొత్తం ఇలా గుంతలతో నిండి ఉంది. వీరవాసరం - పెనుమంట్ర రహదారి నుంచి తోలేరు, ఉత్తరపాలెం మీదుగా వెళ్లే ఈ మార్గంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.

తరచూ ప్రమాదాలు..

వీరవాసరం, భీమవరం మండలాల్లో ఆర్అండ్‌బీ, పంచాయతీ రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. తోలేరు, బలుసులగొయ్యపాలెం, వీరవాసరం - పెనుమంట్ర, రాయకుదురు - కవిటం, బాలెపల్లి, మెంటేపూడి, పెర్కిపాలెం, భీమవరం- కాళీపట్నం, భీమవరం - ఎల్విన్‌పేట, పురం రహదారులపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే పలు చోట్ల రహదారులపై మోకాలి లోతున నీరు నిలిచిపోతుంది. కొన్ని చోట్ల రాళ్లు పైకి తేలి ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రామేశ్వరం - కవిటం రహదారిలో నవుదూరు, కొణితివాడ, మదుగుపోలవరం గ్రామాల మధ్య ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయాలపాలయ్యారు. గుంతల కారణంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని చెబుతున్నారు. వీరవాసరం - పెనుమంట్ర రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకున్నామని ఆర్అండ్‌బీ ఇన్‌ఛార్జి ఏఈ డీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. రామేశ్వరం - కవిటం రహదారి విస్తరణ, అభివృద్ధికి అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. మండలంలోని మిగిలిన ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

జిల్లా ప్రధాన మార్గాల్లో ఒకటైన రామేశ్వరం- కవిటం ఆర్అండ్‌బీ రహదారి ఇది. వీరవాసరం మండలంలో నవుదూరు జంక్షన్ నుంచి మదుగుపోలవరం లంక గ్రామం వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ మార్గం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచు కోలేదు. రూ.16 కోట్లతో ఈ నిర్మాణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన పనులు కార్యరూపం దాల్చలేదు.

సంపద కేంద్రానికి మరమ్మతులు

చెరుకువాడ (ఉండి), న్యూస్‌టుడే: చెరుకువాడలో అర్తమూరు రహదారిలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం అధ్వానంగా ఉన్న తీరుపై 'ఈనాడు- మేమున్నాం.. మీకు తోడుగా'లో సెప్టెంబరు 13న ప్రచురితమైన వార్తకు సర్పంచి కొండేటి సాంబశివరావు, గ్రామ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణలు స్పందించారు. షెడ్డు పైకప్పుకు మరమ్మతులు చేయించారు. యార్డులోకి వెళ్లేందుకు కంకరతో మార్గాన్ని అభివృద్ధి చేసినట్లు సర్పంచి తెలిపారు.

ఆత్మీయ సన్మానం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, కనుమూరి రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజులను బుధవారం సత్కరించారు. ఏఎస్ఆర్ నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, కార్యదర్శి సీహెచ్ సుబ్రహ్మణ్యం రాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల ముందు వ్యర్థాల తొలగింపు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఇళ్ల ముందు వ్యర్థాలను వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న తీరుపై 'నివాసాల మధ్య వ్యర్థాలు' శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ ఆధ్వర్యంలో యంత్ర సహాయంతో ఆ ప్రాంతంలో చెత్తను తొలగింపజేశారు.

6న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: అండర్-15 జిల్లా స్థాయి చదరంగం పోటీలను భీమవరంలో ఈ నెల 6న నిర్వహిస్తామని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.కిశోర్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలను విజయవాడలో 9, 10, 11న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

జనసేన పార్టీలో చేరిక

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం బొండాడ, బొండాడ పేట, ఎల్ఎన్‌పురం గ్రామాలకు చెందిన పలువురు వైకాపా వర్గీయులు సుమారు 250 మంది బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.నాగరాజు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. తొలుత మూడు గ్రామాల్లో జనసేన పార్టీ జెండా స్తూపాలను ప్రారంభించారు.

రజకులకు చెరువులు కేటాయించాలి

పాలకోడేరు, న్యూస్‌టుడే: రజక వృత్తి దారులకు జీవో 343 ప్రకారం ప్రతి గ్రామంలో చెరువులు కేటాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డిపట్ల అమ్మిరావు డిమాండ్ చేశారు. బుధవారం గరగపర్రులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల లీజులు భారీగా పెంచి అధికారులు సైతం ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మహాత్ముని బాటలో నడుద్దాం

ఉండి, న్యూస్‌టుడే: సత్యాగ్రహంతో ఉద్యమ పథంలో నూతన ఒరవడిని సృష్టించిన మహాత్మాగాంధీ బాటలో నడుద్దామని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి ఆయన బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శృంగవృక్షం(పాలకోడేరు), న్యూస్‌టుడే: శృంగవృక్షంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. గాంధీ, పొట్టి శ్రీరాములు, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమవరం అర్బన్, ఆకివీడు, వీరవాసరం న్యూస్‌టుడే: భీమవరం, ఆకివీడులలోని తెదేపా కార్యాలయాల్లో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరవాసరంలో గాంధీ విగ్రహానికి భాజపా నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల ప్రాథమిక ఆసుపత్రి వద్ద గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోపాలకృష్ణంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఉండి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

వీరవాసరం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని వీరవాసరంలో సర్పంచి చికిలే మంగతాయారు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్మికులకు ఏకరూప దుస్తులు అందజేశారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


భీమవరం: ప్రతిజ్ఞ చేస్తున్న కాలనీ సంఘం సభ్యులు


భీమవరం: తెదేపా కార్యాలయంలో..

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
నటరాజ్	------
కిశోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిశోర్ స్క్రీన్ 2	సరిపోదా శనివారం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	------
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	------
విజయలక్ష్మి స్క్రీన్ 1	కళింగ

నాక్ బృందం పరిశీలన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని డాక్టర్ సీఎస్ఎన్ కళాశాలను నాక్ బృందం పరిశీలించనున్నట్లు ప్రధానాచార్యుడు సజ్జా సత్యనారాయణ తెలిపారు. గత నెల 30న వచ్చిన బృందం పరిశీలనను బుధవారం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ

ఉండి, న్యూస్‌టుడే: పేదలకు సేవచేయాలని వ్యవలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ముందుకురావాలని ఆ క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి అన్నారు. ఉండిలోని కూనపరాజు అప్పలరాజు - సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో యాక్సిస్ డిప్యూటీ మేనేజర్ ఫణికుమార్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బొండాడ శేఖరరావుల ఆర్థిక సహకారంతో పేద మహిళలకు బుధవారం వస్త్రాలు పంపిణీ చేశారు.

కొనసాగిన కార్మికుల దీక్షలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించ వద్దంటూ కార్మికులు భీమవరం ప్రకాశం చౌక్‌లో చేపట్టిన దీక్షలు బుధవారం కొనసాగాయి. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కె.ఈశ్వర్, ఎస్.వంశీ, బి.గణేష్ తదితరులు దీక్షల్లో పాల్గొని మద్దతు తెలిపారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు సాలిపేట ప్రాంతంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికంగా ఉన్నత ఉండున్న బుద్దాల వసంతకృష్ణ ఈ నెల 1న రాత్రి తాళ్లకోడు వద్ద నూతనంగా నిర్మించుకున్న ఇంటికి వెళ్లి బుధవారం మధ్యాహ్నం తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి ఉండగా బీరువాలో ఉంచిన 4 కాసుల బంగారు ఆభరణాలు, 54 తులాల వెండి సామగ్రి, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నాగరాజు పరిశీలించారు.

త్వరితగతిన ఈకేవైసీ ప్రక్రియ

మార్టేరు, పెనుగొండ (గ్రామీణ), న్యూస్‌టుడే: ఈ-పంట నమోదు ప్రక్రియలో మిగిలి ఉన్న ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయి ఉద్యోగులకు సూచించారు. ఈ-పంట నమోదు ప్రక్రియపై బుధవారం ఆయన పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఈకేవైసీ ప్రక్రియ 97 శాతం పూర్తయిందన్నారు. మిగిలింది వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ-పంటలో నమోదైన వివరాలు ఆధారంగా రైతులతో మాట్లాడారు. అక్కడి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట ఏవో జ్యోతిశ్రీ, ఆ శాఖ ఉద్యోగులు ఉన్నారు. పెనుగొండ మండలం చినమల్లం, ములపర్రు గ్రామాల పరిధిలో ఈ-పంట నమోదు చేసిన రికార్డులను ఆయన పరిశీలించారు.

సాధన చేసి.. సత్తాచాటి!

క్రీడల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డలు

భీమవరం (గ్రామీణ, న్యూస్‌టుడే: పేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు పరిమిత వనరులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. శ్రద్ధగా చదువుకుంటూనే వారికిష్టమైన ఆటల్లో నిత్యం సాధన చేస్తూ ఇటీవల జరిగిన మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారి విజయాలు, భవిష్యత్తు లక్ష్యాలను ఇలా వివరించారు.


షార్ట్‌పుట్ విసురుతున్న బాలిక

గుర్తింపు కోసం..



అండర్-14 పరుగు పోటీలో రెండో స్థానంలో నిలిచా. గతంలో ఇంటర్ కులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచా. రాబోయే రోజుల్లో మంచి క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకొనేందుకు నిత్యం సాధన చేస్తున్నా. తల్లిదండ్రులు రామారావు, లక్ష్మి ఆల్పాహార శాల నిర్వహిస్తున్నారు.
- పి.హేమసాయిదుర్గ, 8వ తరగతి

ఉపాధ్యాయిని అవుతా..



రుస్సెల్లిల్లిలబాయి ఉన్నత పాఠశాలలో చదువుతున్నా. ఇటీవల అండర్-14 షార్ట్‌పుట్ పోటీల్లో తొలిస్థానంలో నిలిచా. గతంలో పాఠశాల స్థాయిలో జరిగిన పోటీల్లో రెండు పతకాలు అందుకున్నా. తండ్రి మోహనకృష్ణ రైతు, తల్లి ఉమ గృహిణి. వ్యాయామ ఉపాధ్యాయిని కావడమే నా లక్ష్యం.
- కవురు లీలాశ్రీదుర్గ, 8వ తరగతి

ప్రథమ స్థానంలో..



చినఅమిరం గ్రామంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో చదువుతున్నా. అండర్-17 షార్ట్‌పుట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచా. పెద్దయ్యాక ఇంజినీరు కావడమే నా లక్ష్యం. తండ్రి నాగరాజు జిరాక్స్ కేంద్రం నడుపుతున్నారు.
- రత్న ప్రీతి, 9వ తరగతి

మేధో క్రీడపై మక్కువతో..



చదరంగం అంటే ఎంతో ఇష్టం. ఇటీవల జరిగిన పోటీల్లో విజేతగా నిలిచా. గతంలో మూడు పోటీల్లో పాల్గొని రెండుసార్లు పతకాలు సాధించా. భవిష్యత్తులో న్యాయవాది అయ్యి మహిళలకు అండగా నిలుస్తా. తండ్రి సూరిబాబు ఐరన్ పని చేస్తుంటారు. తల్లి ధనలక్ష్మి గృహిణి.
- మధుశ్రీలత, పదో తరగతి

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..



ఆనాకోడేరు ఉన్నత పాఠశాలలో చదువుతున్నా. అండర్-17 చదరంగం పోటీల్లో రెండో స్థానంలో నిలిచా. చిత్రలేఖన పోటీల్లోనూ రాణించి మూడు పతకాలు అందుకున్నా. తల్లి లక్ష్మీపార్వతి అందులో ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. భవిష్యత్తులో ఉపాధ్యాయిని కావడమే నా లక్ష్యం.
- రావూరి మహిమాతేజ స్వీటీ, పదో తరగతి

సేవకులకు పట్టా ప్రదానోత్సవం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎలీషా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో యవ్వన స్థుల కూడిక, నూతన సేవకులకు పట్టాల ప్రదానోత్సవాన్ని బీవీ రాజు లూథరన్ క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేడిది జాన్సన్, బిషప్ వి.సత్యం, పాల్, ఎం.జాషువా తదితరులు పాల్గొన్నారు.


నూతన సేవకులతో అతిథులు, నిర్వాహకులు

శ్మశాన స్థలంపై వివాదం

గరగపర్రులో ఉద్రిక్తత

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలం గరగపర్రులో శ్మశానవాటిక స్థలంపై ఇరువర్గాల మధ్య తలెత్తిన వివాదం బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకుని 4.58 ఎకరాల్లో ఎస్సీల శ్మశాన వాటిక ఉంది. రహదారి పక్కన శ్మశాన స్థలంలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. గతంలో ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. ఈ నిర్మాణాలు, షెడ్లు, పాకలను పొక్లెయిన్‌తో తొలగించేందుకు ఎస్సీ వర్గీయులు ప్రయత్నించగా వైకాపాకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు షేక్ పాపా సాహెబ్, స్థానిక ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అడ్డుకున్నారు. వారు రహదారిపై బైఠాయించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీఐలు కాళీచరణ్, బి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఇరు వర్గాల పెద్దలతో స్థానిక పంచాయతీ కార్యాలయంలో చర్చలు జరిపారు. వారం వ్యవధిలో సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు ఎలాంటి గొడవలకు దిగవద్దని నచ్చచెప్పడంతో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది.


ఇరువర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు

గురువుల పాత్ర కీలకం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో గురువుల పాత్ర కీలకమని కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (ఏపీ పీఎస్ఏ) ఆధ్వర్యంలో భీమవరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి బాటలు వేసేది ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం డివిజన్‌కు చెందిన 50 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. తెదేపా రాష్ట్ర నాయకుడు మెంటే పార్థసారథి, అసోసియేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు వి.సుందర్‌రామ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుంకర మాణిక్యాలరావు, జిల్లా అధ్యక్షుడు తిరుమలరావు, కోశాధికారి కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి నందమూరి రాజేష్, భీమవరం డివిజన్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీహరి, పాలకొండ కార్యదర్శి హరికిషన్, కోశాధికారి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

అత్యవసరమైనా.. అశ్రద్ధే..

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని సమతానగర్, ఎస్టీల రోడ్డు, అయిభీమవరం రోడ్డు, పెదపల్లి వీధి, చినపల్లివీధి తదితర 13 నివాసిత ప్రాంతాలకు ట్రాక్టర్ ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వీటిలో కొన్ని శివారు ప్రాంతాలు. మరికొన్ని ప్రాంతాలకు పైపులైన్ సక్రమంగా లేకపోవడంతో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. కొన్ని ప్రాంతాలకు నిత్యం, మరికొన్ని కాలనీలకు రెండు రోజులకోసారి ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నారు. ఉన్న ఒక్క ట్యాంకర్‌తో రోజుకు 5 నుంచి 6 ట్రిప్పుల్లో 25 వేల నుంచి 30 వేల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ దుస్థితి చూస్తే వెళ్తుందో.. ఒక్కసారిగా కుప్పకూలిపోయేలా ఉంది. ఎటు నుంచి చూసినా తుప్పుపట్టి, రంధ్రాలతో పెచ్చులూడి కనబడుతున్నాయి. అరిగిపోయిన టైర్లతో నడిపిస్తున్నారు. కొన్నేళ్లుగా కనీస మరమ్మతులు చేయించక పోవడంతో పూర్తిగా పాడైంది. అసలు ఆకివీడులో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా చేయడానికి రెండు ట్యాంకర్లు ఉండాలి. ఉన్న ఒక ట్యాంకర్ కూడా నిర్వహణ లేక శిథిలమైంది. దీనికి ఏదైనా జరిగితే ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎఫ్ఈ సురేష్ దృష్టికి తీసుకెళ్లగా కొత్త ట్యాంకర్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. త్వరలో అదనపు ట్యాంకరు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



తుప్పుపట్టి రంధ్రాలతో ఉన్న ట్యాంకర్

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



పెనుగొండలో..

పెనుగొండ, ఆచంట, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం తీరుపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పెనుగొండలో బుధవారం తెల్లవారుజామున జనసేన నాయకులు, భక్తులు నగర సంకీర్తన చేశారు. ఆచంట మండలం వల్లూరులో నగర సంకీర్తన నిర్వహించారు.

కార్మిక హక్కుల సాధన కోసం పోరాడిన ఏచూరి



సిద్ధాంతంలో మాట్లాడుతున్న సీతారాం

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: కార్మిక హక్కుల సాధన కోసం తన జీవితాన్ని దారపోసిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. సిద్ధాంతం గ్రామంలో సీపీఎం పెనుగొండ మండల కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్ మాట్లాడారు.

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: **సమస్య:** స్థానిక సూర్యతేజస్ నగర్‌లో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకున్నాయి. దీని కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

- ప్రసాద్, స్థానికుడు.

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- బాబ్జీ, విద్యుత్తుశాఖ ఏఈ.

సమస్య: స్థానిక లజపతిరాయపేటలో గత కొంతకాలంగా డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు. దీని కారణంగా దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంటుంది. **- శ్రీను, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- దావీదు రాజు, పారిశుద్ధ్య అధికారి

పెనుగొండ, న్యూస్‌టుడే: **సమస్య:** నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో రహదారిపై చెత్త పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం.

- కె.నాగిరెడ్డి, పెనుగొండ

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగిస్తాం.

- టి.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి, పెనుగొండ

కీలక దశలో ముప్పేటదాడి...!

వరి పంటకు ఎలుకల బెడద
తప్పని తెగుళ్ల సమస్య

ఒక్కో మూషికానికి వంద

ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎలుకల సమస్య ఎక్కువగా ఉంది. 20 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నా. ఎలుకలు పట్టుకున్నందుకు కేవలం ఒక రోజులోనే రూ.8 వేలు ఇచ్చా. వీటి తీవ్రత పెరగడంతో ఎలుకకు వంద చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ సారి తెగుళ్ల నివారణకు భారీ ఖర్చు చేయాల్సి వచ్చిందని ఆలమూరు ప్రాంతానికి చెందిన రాజు చెప్పారు.



● మొన్నటి వర్షాలకు సాగు చేసిన రెండెకరాల్లో కొంత దెబ్బతింది. ఏదో కష్టం నుంచి బయటపడ్డాం కదా అనుకునే లోపు తెగులు సమస్య ఎదురొచ్చింది. పంటను ఆశించిన ఎండాకు తెగులు నివారణకు అదనంగా ఖర్చు చేశా. దోమ, ఎలుకల సమస్య సైతం పెరిగింది. చివరకు కష్టమే మిలుగుతుందని ఆచంట ప్రాంతానికి చెందిన రైతు శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలమూరు ప్రాంతంలో క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న రైతు

ఆచంట, మార్టేరు, న్యూస్‌టుడే

వరి పంటను వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లు చుట్టుముట్టాయి. వీటికి తోడు మేమున్నాం.. అంటూ ఎలుకలు ముప్పేట దాడి చేస్తూ పంటను నరకేస్తున్నాయి. అకాల వర్షాలతో అగచాట్లు పడ్డ రైతులకు ఈ పరిస్థితులు మూలిగే నక్కపై తాడికాయ పడ్డట్లుగా మారింది. కీలక దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. దీంతో కాస్త వీటి ఉద్ధృతి తగ్గినా చివరకు పంట ఏ మేర చేతికందుతుందోనని చింత రైతుల్లో కనిపిస్తోంది. సాగులో ఎదురైన ఈ పరిణామాలు విత్తన పంటకు సమస్యగా మారాయి.

అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి..

ఆరుగాలం శ్రమించే రైతుకు తగిన ప్రతిఫలం దక్కాలంటే పంటల్లో చీడపీడలు, తెగుళ్ల బెడద లేకుండా ఉండాలి. కాని ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇవన్నీ ముప్పేట దాడి చేయడంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో 35,722 హెక్టార్లలో సాగైన వరి వివిధ దశల్లో ఉంది. అధిక విస్తీర్ణంలో ఎంటీయూ 1318 రకాన్ని సాగు చేశారు. ఈ రకంతోపాటు పీఆర్ 126 రకాల్లో ఎలుకల తెగుళ్ల సమస్య రోజు రోజుకీ పెరిగింది. ఇటీవల భారీ వర్షాలు, ఆపై అధిక ఉష్ణోగ్రత, గాలిలో తేమ, స్వచ్ఛమైన ఎండ మొదలైన వాతావరణ పరిస్థితులు ఈ తెగులు వ్యాప్తికి దోహదం చేశాయి. సస్యరక్షణ చర్యలతో కాస్త కుదుటపడినా తిరిగి వాతావరణ మార్పులు సంభవిస్తే సమస్య మొదటికొస్తుందని రైతులు భయపడుతున్నారు. పైగా సుడిదోమ కూడా పంటను ఆశించడం ఈ క్రమంలోనే ఎలుకల సమస్య పెరగడం రైతులను మరింత కలవర పెడుతోంది.

విత్తన పంటకు తప్పని కష్టం

దాళ్వా విత్తనం కోసం సాగు చేసిన ఎంటీయూ 1121, ఎంటీయూ 1153, పీఆర్ 126, ఇతర కొన్ని రకాలపైనా తెగుళ్లు వ్యాపించాయి. భారీ వర్షాలకు ముంపులో ఉన్న పొలాల్లోని పంటకు దుబ్బు కుళ్లు సమస్య ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. అక్కడికక్కడ కాండం తొలుచు పురుగు సమస్య సైతం కనిపిస్తుంది. ఈ రకాలపై దోమ తీవ్రత ఎక్కువగా ఉంది. తెగుళ్లు, చీడపీడలు ఆశించకుండా ఉంటేనే తదుపరి పంటకు విత్తనంగా ఉపయోగపడతాయి. ప్రస్తుత విత్తన సాగులో ప్రతికూల పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గడమే కాకుండా నాణ్యమైన విత్తనం వచ్చే అవకాశాలు తక్కువవుతాయి.

వాతావరణ మార్పులే కారణం

వరిలో వివిధ రకాల చీడ పీడలు, తెగుళ్ల వ్యాప్తికి ఇటీవల మారిన వాతావరణ మార్పులే ప్రధాన కారణం. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు అవసరమైన మేర తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. **- కృష్ణాజీ, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, మార్టేరు**



పెనుగొండ గ్రామ సభలో అధికారులు, నాయకులు

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం

పెనుగొండ, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని తెలిపారు. బుధవారం పంచాయతీ ఆవరణలో ఉపాధి హామీ పనుల అంచనాల రూపకల్పనకు నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ● ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వడలి సర్పంచి కాసాని విజయలక్ష్మి తెలిపారు. బుధవారం పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ రూ.55 లక్షలతో పలు కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు.



చరవాణిలో వివరాలు పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

త్వరితగతిన ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలి

మార్టేరు, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఈ-పంట నమోదు ప్రక్రియలో మిగిలి ఉన్న ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయి ఉద్యోగులకు సూచించారు. ఈ-పంట నమోదు ప్రక్రియపై బుధవారం ఆయన పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఈకేవైసీ ప్రక్రియ 97 శాతానికి పైగా పూర్తయిందన్నారు. మిగిలింది వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ-పంటలో నమోదైన వివరాల ఆధారంగా రైతులతో మాట్లాడారు. అక్కడి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట ఏవో జ్యోషీలా, ఆ శాఖ ఉద్యోగులు ఉన్నారు. పెనుగొండ మండలం చినమల్లం, ములపర్రు గ్రామాల పరిధిలో ఈ-పంట నమోదు చేసిన రికార్డులను ఆయన పరిశీలించారు.



జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన

నరసాపురం, న్యూస్‌టుడే: రహదారిపై పశువులు తిరగకుండా అరికట్టాలని కోరుతూ బుధవారం ముత్యాలపల్లి 216 జాతీయ రహదారిపై పలువురు నిరసన ప్రదర్శన చేశారు. పశువులు, పెంపుడు జంతువులు రహదారులపైకి వదిలేయడంతో తరచూ వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాటి యజమానులపై వెంటనే చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు.

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న రామరాజు

నరసాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక నడవా ఏర్పాటు చేసి, అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా తెదేపా అధ్యక్షుడు, ఏపీఐఐడీసీ ఛైర్మన్ మంతెన రామరాజు అన్నారు. నరసాపురంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయం దాని అనుబంధ పరిశ్రమలు మాత్రమే ఉన్నాయన్నారు. ఇతర పరిశ్రమలు కూడా ఏర్పాటు చేస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. ఈ సమావేశంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ యంఏ షరీఫ్, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

మార్టేరు, న్యూస్‌టుడే: చేనేత కార్మికులను ఆదుకునే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్యభాస్కరరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



కళాశాల విద్యార్థులతో ఏడీఆర్ శ్రీనివాస్

మార్టేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా ముందడుగు వేయాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ సూచించారు. స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సీనియర్ల ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలను చేరుకోగలమన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు మంచి భావంతో మెలిగి అందరి మన్నన పొందాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని అలరించాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌ఛార్జి ఎన్.వెరోనిక, శాస్త్రవేత్తలు బి.సహదేవ రెడ్డి, పి.రాధిక, జె.దయాళ్‌ప్రసాద్‌బాబు, వై.సునీత, తదితరులు పాల్గొన్నారు.

అహింసా మార్గం అనుసరణీయం



నరసాపురంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగారాజు

నరసాపురం, న్యూస్‌టుడే: ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మగాంధీ చూపిన అహింసా మార్గంలో పయనించాలని నరసాపురం సీనియర్ సివిల్‌జడ్జి జి. గంగరాజు సూచించారు. ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా నరసాపురం ఉపకారగారంలో పర్యవేక్షణాధికారి టి.అప్పారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. తొందరపాటు నిర్ణయాలు అనర్థదాయకమన్నారు. నేర స్వభావాన్ని సంస్కరించేందుకే జైలు శిక్షలని చెప్పారు. సత్ప్రవర్తన అలవరుచుకోవాలని జూనియర్ డివిజన్ సివిల్‌జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. ఈ సందర్భంగా జైలు ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి న్యాయమూర్తులు పుష్పమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

నరసాపురం, గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో తెదేపా, జనసేన కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో శాసనమండలి మాజీ ఛైర్మన్ యంఏ షరీఫ్, ఏపీఐఐడీసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పొత్తూరి రామరాజు తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు రుస్తుంబాదలోని ఆయన ఇంటి వద్ద నుంచి ప్రదర్శనగా వచ్చి పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. రుస్తుంబాద లేసు ట్రేడ్ సెంటర్‌లో మహాత్ముని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కుష్ఠురోగుల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు.



మార్టేరు : పరిశోధన స్థానంలో నివాళి అర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు



పాలకొల్లు : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న అంగర తదితరులు

పాలకొల్లు, పట్టణం, న్యూస్‌టుడే: మహాత్ముడు చూపిన బాటలోనే ప్రజాకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం నడుచుకుంటుందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. గాంధీ జయంతి వేడుకలను పాలకొల్లు గాంధీ బొమ్మల కూడలిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కూటమి నాయకులు మాట్లాడారు.

పెనుమంట్ర, మార్టేరు, న్యూస్‌టుడే: మహాత్ముడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ కోరారు. మార్టేరు పరిశోధన స్థానంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No. 3 of 2021 in O.S.No. 99 of 2019

Between:

పిటీషనర్/డి. హెచ్. ఆర్. : దొడ్డా సురేంద్ర

మరియు

రెస్పాండెంటు/జె.డి.ఆర్. : కడలి నర్సింహస్వామి

పై నెంబరు ఇ.పి.లో పిటీషనరు/డిహెచ్.ఆర్.కు రావాల్సిన ఇ.పి. బాకీ వసూలు నిమిత్తం రెస్పాండెంటు / జెడిఆర్‌కు చెందిన యీ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 25-10-2024వ తేదీ ఉదయం గం. 10-30 ని॥ల లగాయితూ పై కోర్టు వారి ఆవరణలో సదరు షెడ్యూలు ఆస్తిని వేలం వేయుదురు. కావున ఆసక్తి ఉన్నవారు సదరు వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు ఆస్తి వివరం

ప॥గో॥జిల్లా, పాలకొల్లు రెవెన్యూ మండలం, పాలకొల్లు సబ్-రిజిస్ట్రారులో చేరిన పెదమామిడి గ్రామ పంచాయతీలోని, పెదమామిడిపల్లి గ్రామం తాలూకు క్రియాస్తి వివరం:

పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు రెవెన్యూ మండలం, పాలకొల్లు సబ్-రిజిస్ట్రారులో చేరిన, పెదమామిడిపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలోని, పెదమామిడిపల్లి గ్రామం తాలూకు 1) రి.స.నెం. 67/1రు పూరా య. 0-31 సెంట్లు, 2) రి.స.నెం. 65/3Fరు పూరా య. 0-11 సెంట్లులో య. 0-08 సెంట్లున్ను, 3) రి.స.నెం. 65/4Cరు పూరా య. 0-12 సెంట్లు, 4) రి.స.నెం. 65/5రు పూరా య. 0-28 సెంట్లు, 5) రి.స.నెం. 65/6రు పూరా య. 0-32 సెంట్లు, 6) రి.స.నెం. 64/17రు పూరా య. 0-02 సెంట్లు, 7) రి.స.నెం. 64/19రు పూరా య. 0-02 సెంట్లు, 8) రి.స.నెం. 65/8రు పూరా య. 0-09 సెంట్లు, 9) రి.స.నెం. 65/3Bరు పూరా య. 0-11 సెంట్లులో య. 0-07 సెంట్లు, 10) రి.స.నెం. 65/3Cరు పూరా య. 0-07 సెంట్లు, 11) రి.స.నెం. 65/3Dరు పూరా య. 0-06 సెంట్లు, 12) రి.స.నెం. 65/3Eరు పూరా య. 0-06 సెంట్లు, 13) రి.స.నెం. 65/3Fరు పూరా య. 0-11 సెంట్లులో య. 0-03 సెంట్లు, 14) రి.స.నెం. 64/14రు పూరా య. 0-04 సెంట్లులో య. 0-01 సెంట్లు, 15) రి.స.నెం. 64/15రు పూరా య. 0-03 సెంట్లులో య. 0-02 సెంట్లు, 16) రి.స.నెం. 64/16రు పూరా య. 0-11 సెంట్లు, 17) రి.స.నెం. 64/3Fరు పూరా య. 0-11 సెంట్లులో య. 0-02 సెంట్లు, 18) రి.స.నెం. 64/7రు పూరా య. 0-02 1/2 సెంట్లులో య. 0-01 సెంట్లు, 19) రి.స.నెం. 64/8రు పూరా య. 0-02 సెంట్లు, 20) రి.స.నెం. 64/9రు పూరా య. 0-02 సెంట్లు, 21) రి.స.నెం. 64/10రు పూరా య. 0-09 సెంట్లు, 22) రి.స.నెం. 64/11Bరు పూరా య. 0-14 సెంట్లులో య. 0-04 సెంట్లు, 23) రి.స.నెం. 64/11Cరు పూరా య. 0-05 సెంట్లులో య. 0-02 సెంట్లున్ను, 24) రి.స.నెం. 65/3Aరు పూరా య. 0-11 సెంట్లున్ను, 25) రి.స.నెం. 65/3Bరు పూరా య. 0-11 సెంట్లున్ను, 26) రి.స.నెం. 65/4Aరు పూరా య. 0-04 సెంట్లున్ను, 27) రి.స.నెం. 65/4Bరు పూరా య. 0-04 సెంట్లున్ను, వెరశి య. 2-19 సెంట్లు భూమి లేక చ.గ. 10599.6 లు భూమిని చిన్న చిన్న ప్రతులుగా విభజన చేసినందున సదరు ప్రతులు దాఖలా మీకు నేను విక్రయించిన నెం. 40రు ప్రతి చ.గ. 171.33లుకు హద్దులు, కొల్తలు.

తూర్పు: ప్లాను దాఖలా నెం. 28, 27రు ప్లాట్లులో పడమర వైపు అ. 9-0లు వెడల్పున్ను, యీ ఆస్తిలో తూర్పు వైపున అ. 9-0లు వెడల్పున్ను వెరశి అ. 18-0లు వెడల్పు గల రోడ్డు అ. 33-6లు. **దక్షిణం:** నా భూమి (వెండారు భూమి) అ. 46-9లు **పడమర:** కడలి నరసింహారావు గారి భూమి అ. 33-0లు **ఉత్తరం:** ప్లాను దాఖలా నెం. 41రు ప్లాటు స్థలం అ. 46-0లు

ఈ హద్దుల మధ్య చ.గ. 17133లుకు చ.మీ. 143.25ల్ల స్థలమున్ను, యీ స్థలముకు రివాజు ప్రకారం అమలు జరుగు నడక మార్గపు, నీటి వాడకపు హక్కుల, యావత్తు యీజ్‌మెంట్ హక్కులున్ను సహా.

డి. హెచ్. ఆర్. విలువ	:	రూ. 6,00,000-00
అమీనా విలువ	:	రూ. 10,00,000-00
సబ్ రిజిస్ట్రారు విలువ	:	రూ. 3,08,394-00

సం/- జక్కంశెట్టి వెంకటేశ్వరరావు
నర్సాపురం అడ్వకేటు, నరసాపురం,
ది. 02-10-2024 సెల్: 97055 47788, 97042 74245

కార్యాలయం ముందే చెత్త..!



తహసీల్దార్ కార్యాలయం ముందు చెత్త, వ్యర్థాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ చెత్తను ఆవులు, కుక్కలు, పందులు రోడ్డుపైకి చేరుస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయం ముందే ఇంత అధ్వానంగా ఉంటున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొప్పర్రు - మత్స్యపురి ప్రధాన రహదారిని ఆనుకుని కొప్పర్రు గ్రామ పరిధిలో రక్షిత మంచినీటి పైపులైన్ మరమ్మతులు చేసి సంప్ పిట్స్‌పై మూతలు వేయకుండా వదిలేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం పలు గ్రామాల ప్రజలు, వాహన చోదకులు వెళ్తుంటారు. రహదారి చెంత ప్రమాదకరంగా ఉన్న సంప్ పిట్స్‌పై మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ టి.లోకేశ్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని చెప్పారు.

జోరుగా మాంసం అమ్మకాలు



నరసాపురం: మార్కెట్లో విక్రయిస్తున్న చేపలు

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని అందించిన జాతిపిత గాంధీజీ జయంతి రోజున ప్రభుత్వం మద్యపానం, జీవహింస నిషేధించింది. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టణంలోని మార్కెట్లలో చేపలు, మాంసం యథేచ్ఛగా విక్రయించారు. రెస్టారెంట్లలో వాటి విక్రయాలు చేశారు. గొలుసు దుకాణాల్లో రెట్టింపు ధరలకు మద్యం సీసాలు విక్రయించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జయంతి రోజున కూడా పెనుగొండలో పలు మాసం దుకాణాల్లో కోడి, మేక మాంసం అమ్మకాలు సాగించారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఈ అమ్మకాలు సాగాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీకి ఇదేనా మనమిచ్చే గౌరవం అంటూ గ్రామస్థులు వాపోతున్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పోడూరు, న్యూస్‌టుడే: పండితవిల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వి.సత్యప్రియరామ్ విద్యార్థులకు గణితం బోధించి వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పీఎస్, ఎన్ఎస్ పాఠ్య పుస్తకంలో ఉన్న చిత్రాలను అందంగా గీసిన వారిని ఎంపిక చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నరసాపురం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం కాపు వనితా క్లబ్ సభ్యులు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, వనితాక్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి, బండి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు : భీమవరం

S.O.P. No.03/2024

Between :

పిటీషనర్ : వేండ్ర శారదామణికుమారి @ బొక్కా శారదామణికుమారి, పెంపుడు తండ్రి(లేటు) వేండ్ర మధుసూధనరావు D/o.బొక్కా ముత్యాలు, డోర్‌నెం. 1-32, కాళీపట్నం, మొగల్తూరు మండలం, పశ్చిమగోదావరిజిల్లా.

రెస్పాండెంట్ : ది బ్రాంచ్ మేనేజర్, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, భీమవరం బ్రాంచి తహశీల్దారు ఆఫీసువద్ద, భీమవరం పశ్చిమ గోదావరి జిల్లా

పిటీషనర్ తరుపున చేసిన ప్రకటన

పై నెంబర్ పిటీషనులో. పిటీషనరు తన పెంపుడు తండ్రి గారైన **వేండ్ర మధుసూధనరావు గారు ది.05.06.2021**వ తేదీన మరణించి ఉన్నారని సదరు వేండ్ర మధుసూధనరావు గారి పేరున **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్,** భీమవరం బ్రాంచి నందు లాకరులో ఉన్న డిపాజిట్ సొమ్ము మరియు ఇతర వస్తువులు తీసుకొనుటకు ఆమె మాత్రమే వారసురాలని ప్రకటిస్తూ వారసత్వ సర్టిఫికెట్ ఇప్పించవలసిందిగా పైన తెలిపిన కోర్టులో పిటీషను దాఖలు చేసిఉన్నారు. దీనిపై అభ్యంతరములు ఉన్నచో ది. **15.10.2024**వ తేదిన ఉదయం **10.30**గం॥లకు శ్రీ కోర్టు వారి యెదుట స్వయముగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలియ జేయవలసిందిగా ఇందుమూలముగా తెలియ చేయడమైనది.

వాయిదా తేది.15.10.2024

భీమవరం
తేది.01.10.2024

పాకా రమేష్‌బాబు
కట్టా మాలతీలత
అడ్వకేట్స్ భీమవరం
సెల్ : 9701842726, 9704069929

Karur Vysya Bank Smart way to bank

ది కరూర్ వైశ్యాబ్యాంకు లిమిటెడ్

డి.నెం.13-1-11/9, జెట్టిట్యాంక్ రోడ్, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా-534260. సెల్‌నెం.9652270270

బంగారు నగల వేలము ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారుడు బంగారు నగలపై మా శాఖలో అప్పు తీసుకొని సకాలంలో తమ బకాయిలు చెల్లించని కారణంగా బ్యాంక్ నిబంధనలు ప్రకారం **తేది. 11.10.2024** అనగా శుక్రవారం సాయంత్రం **3.00** గం॥లకు మా బ్రాంచ్ ఆవరణలో వేలం వేసి బాకీలు వసూలు చేసుకుందామని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షరతులు నిబంధనలు: 1) వేలంలో పాల్గొనదలచినవారు **రూ.10,000/-లు** ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 3) నగలు బరువుకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) అడ్రస్ నిర్ధారించు ఆధార్ కార్డు కాపీని గాని, పాన్‌కార్డు కాపీని జతచేయవలెను. 6) ఈ ఖాతాదారులలో ఎవరైననూ మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 7) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను. 8) జి.ఎస్.టి. వర్తించబడును., 9) ఆన్‌లైన్ బిడ్స్ కూడా స్వీకరించబడును.

ఖాతా నెం.	ఋణగ్రస్తుని పేరు మరియు చిరునామా	ఆభరణముల సంఖ్య	బంగారం బరువు గ్రా॥లో
1419949000003928	మగతం సతీష్‌బాబు, తండ్రి: రామలింగం 4-59, మెయిన్‌రోడ్, ఆంజనేయస్వామి గుడి దగ్గర, యలమంచిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా.	01	24.00
1419953000043850		05	13.40

తేది : 03.10.2024
ప్రదేశం : పాలకొల్లు

సం/- అధీకృత అధికారి
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

అడ్డంగా ఆవులు!



పాలకొల్లు, న్యూస్‌టుడే: రహదారులపైకి వదిలేస్తున్న ఆవుల కారణంగా ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. పాలకొల్లు పట్టణంలో ఏపక్క చూసినా ఆవులు, ఆంబోతుల వీరంగం ఎక్కువగా కనిపిస్తోంది. రాత్రి వేళల్లో ప్రధాన రహదారులకు అడ్డంగా కనీసం వాహనం వెళ్లడానికి కూడా చోటివ్వకుండా రోడ్డుపై పడుకుంటున్నాయి. సహనం కలిగినవారు వాహనాలను ఆపి ఆవులను పక్కకు తోలి ముందుకు వెళ్తున్నారు. మరికొందరు ఆవుల తోకలు, కాళ్లపైనుంచి వాహనం ఎక్కించుకుపోతున్నారు. పురపాలిక ఆధ్వర్యంలో గోశాల నిర్వహిస్తే తప్ప, ఆవుల సమస్యకు పరిష్కారం లభించదని పలువురు వాపోతున్నారు.

పాడైనవి.. పట్టుకెళ్లేదెవరూ..!



పెనుమంట్ర సొసైటీ వద్ద న్యూస్‌టుడే క్లిక్ మన్పించిన ఈ చిత్రంలోని గోనె సంచులు చూసి ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కోసం తెచ్చినవి అనుకుంటే పొరబడినట్లే. గత సీజన్‌లో వచ్చిన వాటిలో పాడైనవే ఇవన్నీ... ఉండి పౌర సరఫరాల సంస్థ గిడ్డంగికి వీటిని తరలించేందుకు అక్కడి యంత్రాంగం అనుమతించకపోవడంతో వాటిని భద్రపర్చడం సమస్యగా మారింది. చివరకు సొసైటీ భవనం అరుగుపై వదిలేయడంతో అవి వానకు తడిసి, ఎండ ఎండి దుర్వాసన వస్తున్నాయి. కార్యాలయంలోకి వెళ్లేందుకు ఇవి అడ్డుగా ఉండటంతో అక్కడికి వెళ్లే వారికి ఇబ్బందిగా ఉంది. **- పెనుమంట్ర, న్యూస్‌టుడే**

తాడేపల్లిగూడెం

•తాడేపల్లిగూడెం •తణుకు

రైతులకు అండగా ఉంటాం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా వారికి అండగా నిలుస్తానని వైకాపా రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం నాయుడు పేర్కొన్నారు. స్థానిక సవితృపేటలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు.

నేడు తెలుగు సాహితీ సమాఖ్య సమావేశం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ధన రెసిడెన్సీలో గురువారం తెలుగు సాహితీ సమాఖ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బ్రహ్మాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాఖ్య సభ్యులు, సాహితీ వేత్తలు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీలు చేపట్టాలంటూ దీక్ష



తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంటపాడు, న్యూస్‌టుడే :

సమస్య : పెంటపాడులోని 1వ వార్డు, మునిసాని వారి వీధుల్లో డ్రెయిన్లు వ్యర్థాలతో మేట వేశాయి. దోమల ఉధృతితో ఇబ్బందులు పడుతున్నారు. - వాసు, స్థానికుడు

సమాధానం : డ్రెయిన్లను బాగు చేయడానికి చర్యలు తీసుకుంటాం. - శోభన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి

సమస్య : పెంటపాడులోని మిడ్‌లెవెల్ కాలువ వంతెన వద్ద ప్రధాన రహదారి గోతులు పడి అధ్వానంగా మారింది. రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - నాగేశ్వరరావు, స్థానికుడు

సమాధానం : రహదారికి మరమ్మతులు నిర్వహిస్తాం. - రవిబాబు, ఏఈ ర.భ.శా



మొక్కలతో ప్రదర్శన

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి పురస్కరించుకుని స్థానిక బస్‌డిపో ఆవరణలో డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా 15 రోజులుగా తణుకు, అత్తిలి డిపో ఆవరణలో మొక్కలు నాటడం, పరిసరాలు పరిశుభ్రం చేయడం తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న నాయకులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దళితులపై దాడులను అరికట్టేందుకు ఐక్యమత్యంతో పోరాడాలని దళిత ఐక్యవేదిక కన్వీనర్ పొట్ల సురేష్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద బుధవారం దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గ కన్వీనర్లుగా న్యాయవాది పొట్ల సురేష్, పెనుమల రాజేష్ కుమార్‌లను నియమించారు. అంబేడ్కర్, నాగేశ్వరరావు, వెంకటరావు, బాలు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అత్యధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు. చానమిల్లి, అడవికొలను, బావాయిపాలెం గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో సాగవుతున్న వరి పంటలను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి గీతాదేవి, రైతులు ఉన్నారు.

చీకట్లో ప్రయాణం..!




రాత్రయితే చాలు పట్టణం అంధకారమవుతోంది. వెలుగులందించే దీపాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షలు వెచ్చిస్తున్నా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. చీకట్లో గోతుల మార్గాల్లో ప్రయాణం ప్రహసనంగా మారుతోంది.

వెలగని వీధి దీపాలు

న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో రాత్రి వేళ కారు చీకట్లు అలుముకుంటున్నాయి. ఏటా రూ. లక్షల నిధులు ఖర్చు చేస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు రావడం లేదు. నాసిరకం ఎల్ఈడీ దీపాలు వినియోగించడం వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఫలితంగా ప్రధాన రహదారులు, కూడళ్లు, వీధుల్లో అంధకారం రాజ్యమేలుతోంది. మరోవైపు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రాత్రి సమయంలో గోతులు పడిన రోడ్లపై ప్రయాణం చేసేందుకు వాహనదారులు యాతన పడుతున్నారు. విభాగాలపై విద్యుత్తు దీపాలు పూర్తి స్థాయిలో వెలగకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. ప్రధానంగా ఏలూరు, కే.ఎన్ రోడ్డులో ఎల్ఈడీ దీపాలు మూలకు చేరాయి.

మొత్తం వీధి దీపాలు: 5722



మరమ్మతుకు గురైనవి

వెలిగేవి

ఏటా నిర్వహణ వ్యయం: రూ.75 లక్షలు

వాహనాలు, దుకాణాల ద్వారా వచ్చే వెలుతురుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తూతూమంత్రంగా నిర్వహణ పనులు చేస్తుండటంతో పరిస్థితి ఈ విధంగా తయారైంది. దీనిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు.

మొదటి పైవంతెనపై సైతం మరమ్మతుకు గురయ్యాయి. చివరకు నిఘా నేత్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో కూడా దీపాలు వెలగకపోవడం గమనార్హం.





స్థానిక మహిళా కళాశాల వెనుక రోడ్డు పై విద్యుత్తు దీపాలు ఉన్నా వెలగని పరిస్థితి. చీకటిగా ఉండటంతో ఆకతాయిలు ఈ మార్గంలో చేరి అలజడులు సృష్టిస్తున్నారు. మందుబాబులు యథేచ్ఛగా రోడ్డుపైనే మద్యం తాగి వీరంగం చేస్తున్నారు.

రద్దీగా ఉండే ఏలూరు రోడ్డుపై వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటాయి. పెట్రోల్ బంకు నుంచి సాయి బాబా ఆలయం వరకు ఇదే పరిస్థితి. సుమారు 30కి పైగా దీపాలు వెలగడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



దివ్యాంగుల క్రీడాకారుల అభ్యున్నతికి కృషి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారులకు అన్ని విధాల సహకారం అందిస్తానని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. దివ్యాంగుల ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ బుధవారం భీమవరంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగుల క్రీడాకారులకు సదుపాయాల కల్పనకు సహకరిస్తామన్నారు. దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణను మంత్రి ఘనంగా సత్కరించారు.

డీఎస్పీని కలిసిన భాజపా నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్‌ను ఆయన కార్యాలయంలో భాజపా నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డీఎస్పీని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, జిల్లా నాయకుడు నరిశే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించండి



వివరాలు సేకరిస్తున్న నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవతి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర న్యాయ సేవ సంస్థ ఆదేశాల మేరకు బుధవారం తణుకు నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవతి స్థానిక బాల సదన్ చిల్డ్రన్స్ హోం, సమారిటన్ చిల్డ్రన్స్ హోం, మానసిక వికలాంగుల గృహం, ప్రభుత్వ బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహ భవనాలు, వంట గదులు, మరుగుదొడ్లు శుభ్రత, తాగునీటి సరఫరా తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి రంజిత్ కుమార్, న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉడకట్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గమిని సుబ్బారావు శిబిరాన్ని ప్రారంభించారు. 95 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు ఉత్సవ శోభ



తాడేపల్లిగూడెం: వాసవీ కన్యకా పరమేశ్వరి క్షేత్రం



ముత్యాలమ్మ దేవస్థానం



తణుకులో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవార్ల ఆలయాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే ఆలయాల వద్ద క్యూలైన్లు, పార్కింగ్ ఇతర ఏర్పాట్లను పూర్తి చేశారు. విద్యుత్తు దీప కాంతులతో ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. పురదేవత బలుసులమ్మ, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, మహంకాళమ్మ, ముత్యాలమ్మ ఆలయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. మండపాక యల్లారమ్మ ఆలయానికి విద్యుద్దీపాలు అలంకరించారు.

కోళ్ల వ్యర్థాల తరలింపు... లారీలు స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న నాలుగు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.ఎస్. సతీశ్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు... విజయవాడ, హైదరాబాద్ నగరాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చేపల చెరువులకు మేతగా వేసేందుకు లారీల్లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

పెదపాడు: మూగజీవాలను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై కె.ఎస్.సతీశ్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు... కాకినాడ జిల్లా తుని నుంచి పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు 48 ఆవు దూడలను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. కలపర్రు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేసి లారీని గుర్తించారు. లారీని స్వాధీనం చేసుకుని... దూడలను ఏలూరులోని గోశాలకు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హామీలు అమలు చేయండి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వెల్పూరు సీపీఎం శాఖ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వెల్పూరు ప్రజా సంఘం హాల్‌లో నరసింహారావు అధ్యక్షతన మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రతాప్ సభ్యులకు పని పద్ధతిపై సమీక్ష నిర్వహించారు. సీపీఎం శాఖా కార్యదర్శిగా వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శి బళ్ళ చినవీరభద్రరావు, రామకృష్ణ, అర్జున్, పోసియ్య, నాగేంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి పోలేరమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామీణాభివృద్ధి


ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉపాధి నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ సూచించారు. స్థానిక సామాజిక భవనంలో సర్పంచి సింధు అధ్యక్షతన ఉపాధి పనుల ప్రణాళికలపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. పాటిశుభ్రత కార్మికులను ఎంపీడీ గంటా శ్రీలక్ష్మి, ఉప సర్పంచి జగదీష్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ సత్కరించారు.

సత్యం, అహింసల మార్గజ్యోతి

వాడవాడలా గాంధీకి ఘన నివాళి



ఏపీ నిట్‌లో ఆచార్యులు, విద్యార్థులు



గాంధీ చిత్ర పటం వద్ద వీసీ గోపాల్ తదితరులు



తాడేపల్లిగూడెం గ్రంథాలయంలో..

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యం, అహింసలను మించిన ఆయుధాలు లేవంటూ ప్రపంచ శాంతికి మార్గం నిర్దేశించిన గాంధీజీని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎన్డీయే నాయకులు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ★ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు చోట్ల కార్యక్రమం నిర్వహించారు. ★ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ★ తణుకు పట్టణంలోని శ్రీదేవి హోటల్ సమీపంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ నివాళులర్పించారు.

తాడేపల్లిగూడెం అర్బన్, పెంటపాడు, తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: పెంటపాడు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ★ తాడేపల్లిగూడెం పట్టణంలోని తెదేపా కార్యాలయం వద్ద తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ★ స్వాతంత్య్ర సమరయోధుల ఆదుగుజాడల్లో నడవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేశ్‌శంకర్ రెడ్డి అన్నారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో జాతిపిత గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఘనంగా నిర్వహించారు. ★ తాడేపల్లిగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహాత్మా గాంధీ మహనీయుడని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా. కె.గోపాల్ పేర్కొన్నారు. స్థానిక పరిపాలనా భవనంలో గాంధీజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పరిశోధన సంచాలకులు మాధవి, డీన్‌లు నారం నాయుడు, వెంకట రమణ, సూర్యకుమారి, విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు. ★ మహాత్ముడు చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు అన్నారు. వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో గాంధీ జయంతి నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాల్లో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కరుణ శ్రీ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరా, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు దాసరి ఆదినారాయణ గాంధీ కాంస్య విగ్రహాన్ని బహూకరించారు. ★ అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో దళిత వంశీ రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అమీలు జమా కార్యాలయ సిబ్బంది గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులు అర్పించారు.



తాడేపల్లిగూడెం : తెదేపా కార్యాలయంలో ..



తణుకులో ఎన్డీయే నాయకులు

'రోజా వ్యాఖ్యలు విడ్డూరం'

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఎంపీ, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై మాజీ మంత్రి రోజా వ్యాఖ్యలు విడ్డూరమని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మాలతీరాణి అన్నారు. శ్రీవారి దర్శన టిక్కెట్లు అమ్ముకున్న రోజాకు తిరుమల పవిత్రతపై మాట్లాడే అర్హత లేదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అపూర్వ సమ్మేళనం



తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మారంపల్లి జిల్లా పరిషత్ ఓరియంటల్ (సంస్కృత) ఉన్నత పాఠశాలలో 2006-2007 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. గురువులను సత్కరించారు.

నూనె ధరకు రెక్కలు



పెంటపాడు, తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: గత నెల 13 వరకు పామాయిల్ ప్యాకెట్ రూ.85 ఉండి. ప్రస్తుతం రూ.135 వరకు చేరింది. రూ.100 ఉన్న పొద్దుతిరుగుడు నూనె ప్రస్తుతం రూ.135కు పెరిగింది. పల్లీ, తవుడు, నువ్వుల నూనెల ధరలు కూడా పెరిగిపోయి సామాన్యులకు అందకుండా పోతున్నాయి. నూనె ధరలు పెరగడంతో వంటలు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని గృహిణులు వాపోతున్నారు. ముడి, రిఫైన్డ్ నూనెలపై కేంద్రం ఒక్కసారిగా విదేశీ దిగుమతి సుంకం పెంచడంతో వంట నూనెల ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు 2.80 లక్షల జనాభా ఉండగా 55 వేల కుటుంబాలు ఉన్నాయి. నెలకు కిరాణా దుకాణాల్లో ఎలాంటి నూనెలు లేవు.

కొన్నిరోజులుగా స్థిరంగా ఉన్న ధరలు గతనెల 13వ తేదీ అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా రూ.20కు పైగా పెరిగాయి. ఈ ప్రభావంతో సామాన్యుడి వంటింటి బడ్జెట్ గాడి తప్పింది. కంటి తుడుపు చర్యగా దిగుమతి సుంకాన్ని సగటున లీటరుకు నూనె వినియోగించిన లీటరుకు రూ.20 చొప్పున చూసుకుంటే రూ.11 లక్షల వరకు అదనపు భారం పడుతోంది. కొద్దిగా తగ్గించామని ప్రకటించారు. కానీ అమ్మకందారులు మాత్రం పెరిగిన ధరలే వసూలు చేస్తున్నారు.

తాడేపల్లిగూడెం పట్టణంలో సుమారు 15 నుంచి 20 హోల్‌సేల్ దుకాణాలున్నాయి. వీటి ద్వారా నూనె కొనుగోలు చేసి పల్లెల్లో విక్రయించే వ్యాపారులు ఉన్నారు. పల్లెల్లో కిరాణా దుకాణాల్లోనూ ఈ తరహా అమ్మకాలుంటాయి.

"ఒకవైపు నిత్యావసర సరకులు, కూరగాయల విపరీతంగా పెరిగిపోయాయి. ఇప్పుడు నూనె ధరలు పెరగడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి నూనె, కూరగాయల ధరలు తగ్గించాలని కోరుతున్నాం." అని పెంటపాడుకు చెందిన లక్ష్మి పేర్కొన్నారు.